

మిరపను ఆశిస్తున్న 'నల్ల నల్లి'

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మిరప తోటలను నల్ల నల్లి ఆశిస్తుండడంతో నివారణ చర్యలపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. 8లో



వచ్చేనెల 1న 'జన భోజనాలు'

కులాల వారీగా వన భోజనాలకు బదులు వచ్చేనెల 1న జన భోజనాలు ఏర్పాటుచేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. 10లో

గరిష్టం / కనిష్టం
30° / 15°

వాతావరణం

జిల్లాలో బుధవారం కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది. రాత్రి వేళ చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు



మాట్లాడుతున్న న్యాయమూర్తి చంద్రశేఖరావు, పక్కన సీపీ తదితరులు

ఖమ్మం వైద్యవిభాగం/ఖమ్మం లీగల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖరరావు సూచించారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఇటీవల ఘటనల నేపథ్యాన మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయనే విషయాన్ని గుర్తించాలని తెలిపారు. అనంతరం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ ర్యాగింగ్ చేస్తే భవిష్యత్ బలవుతుందని చెప్పారు. విద్యార్థులు చదువుపై మాత్రమే శ్రద్ధ వహిస్తూ చట్టాలను తెలుసుకుని నడుచుకోవాలని సూచించారు. ఈ సదస్సులో టౌన్ ఏసీపీ రమణమూర్తి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మామిడి హన్మంతతరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి సారించండి



బొప్పాయి తోటను పరిశీలిస్తున్న మధుసూదన్

కూసుమంచి: రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారిస్తే లాభాలు గడించొచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎం.వీ.మధుసూధన్ తెలిపారు. మండలంలోని చేగొమ్మ, కిష్టాపురంల్లో రైతులు సాగు చేస్తున్న బొప్పాయి, ఆయిల్‌పామ్ తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నాక మిర్చి తోటలను కూడా పరిశీలించి తెగుళ్ల నివారణపై సూచనలు చేశారు. అనంతరం ఉద్యానవనశాఖ అధికారి మాట్లాడుతూ వాణిజ్య పంటలకు దీటుగా ఉద్యాన పంటలను సాగు చేస్తే మంచి ఆదాయం లభిస్తుందని, ఈ పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు. కూసుమంచి ఏడీఏ సరిత, ఏఓ వాణి, ఉద్యానవనశాఖ అధికారి అపర్ణ, ఏఈఓలు పాల్గొన్నారు.

మూతబడిన డిగ్రీ, పీజీ కళాశాలలు

ఖమ్మం సహకారనగర్: డిగ్రీ, పీజీ కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు మంగళవారం నుంచి బంద్ పాటిస్తున్నాయి. ఈ విషయమై కేయూలో నోటీసు ఇచ్చి బంద్ చేశామని యాజమాన్యాల అసోసియేషన్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, గుండాల కృష్ణ, కాటేపల్లి నవీన్‌బాబు వెల్లడించారు. గతంలోనూ కళాశాలల బంద్ చేపట్టగా ప్రభుత్వం ఇచ్చిన హామీతో తిరిగి తెరిచామని తెలిపారు. అయితే, బిల్లులు ఇప్పటివరకు విడుదల చేయకపోవడంతో మళ్లీ బంద్ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. కాగా, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో అధ్యాపకులకు వేతనాలు చెల్లించలేకపోతున్నామని, నిర్వహణ కూడా భారంగా మారిందని తెలిపారు. కాగా, డిగ్రీ విద్యార్థులకు మంగళవారం నుంచి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా కళాశాలల బంద్‌తో నిర్వహించలేకపోయామని యాజమాన్యాలు వెల్లడించాయి. దీంతో సమస్య పరిష్కారమై కళాశాలలు తెరిచాక పరీక్షలను రీషెడ్యూల్ చేసే అవకాశముందని సమాచారం.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి అభిషేకం. తమలపాకులతో అర్చన గావించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మేమెంతో మాకంత..



మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, పక్కన సభ్యులు జయప్రకాశ్, సురేందర్, బాల లక్ష్మి, ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, పాటిల్ తదితరులు

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచండి..

- బీసీ కమిషన్‌కు వినతుల వెల్లువ
- బహిరంగ విచారణలో వాదనలు వినిపించిన ఉమ్మడి జిల్లా వాసులు
- నివేదిక ప్రభుత్వానికి అందజేస్తామని కమిషన్ వెల్లడి
- సర్వేకు సహకరించేలా ప్రజలను చైతన్యపరచాలని సూచన



విచారణలో పాల్గొన్న పార్టీలు, సంఘాల నాయకులు



దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: జనాభా ప్రాతిపదికన బీసీలకు రాజకీయంగానే కాక ఇతర రంగాల్లో తగిన రిజర్వేషన్లు కల్పించాలని, కుల వృత్తులతో జీవనం సాగించే వారికి సర్వేలో చెప్పుకునేందుకు కులం పేరు లేకపోవడంతో సంచార జాతులకు గుర్తింపు దక్కడం లేదని వివిధ పార్టీలు, కుల, ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. అంతేకాక బీసీల్లో కొన్ని కులాలకే పదవులు దక్కుతుండగా, ఆర్థికంగా వెనకబడిన కులాలకు సరైన అవకాశాలు లభించడం లేదని తమ వాదనలు వినిపించారు. బీసీ కమిషన్ ఆధ్వర్యాన సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతుల అధ్యయనం కోసం ఖమ్మం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి బహిరంగ విచారణ మంగళవారం చేపట్టారు. బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ నేతృత్వాన జరిగిన విచారణలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి, ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్‌ఖాన్, జితేష్ వి.పాటిల్, ఖమ్మం సీపీ సునీల్‌దత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘాల నేతల నుండి వినతులు స్వీకరించడంతో పాటు వారి వాదనలు విన్నారు.

79 దరఖాస్తులు..

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ బీసీ కమిషన్ చేపట్టిన విచారణలో 79 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 26 లక్షల జనాభా ఉన్నట్లు అంచనాతో సమగ్ర కుటుంబ సర్వే మొదలుపెట్టగా ఇప్పటి వరకు 60 శాతం పూర్తయిందని చెప్పారు. ముందస్తు ఉన్న లెక్కల ప్రకారం బీసీ జనాభా 35 నుంచి 40 శాతం ఉంటుందనే అభిప్రాయం తెలిపామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో కుటుంబ సర్వే 70 శాతం మేర పూర్తయిందని వివరించారు. తొలుత వివిధ కుల సంఘాలు, పార్టీల నాయకులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ప్రతినిధుల సౌలభ్యం కోసం అధికారులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడమేకాక రిజిస్ట్రేషన్లు, నోటరీ, జిరాక్స్ సేవలు ఉచితంగా అందించారు. ఈ సమావేశంలో బీసీ కమిషన్ ప్రత్యేకాధికారి సతీష్, రెండు జిల్లాల బీసీ అభివృద్ధి అధికారులు జి.జ్యోతి, ఇ.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచాలి..

ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లతో బీసీల్లో ఉన్న అనేక కులాలకు సమన్యాయం జరగడం లేదని, ప్రధానంగా ముస్లిం మైనార్టీలు రాజకీయంగా నష్టపోతున్నారని పలువురు వివరించారు. ఉన్న రిజర్వేషన్లనే అన్ని కులాలకు పంచడంతో చాలామందికి అన్యాయం జరుగుతోందన్నారు. కులగణన సర్వేలో విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ అనే కులాలు లేకపోవడంతో ఎలా నమోదు చేసుకోవాలో తెలియని పరిస్థితి ఉందని విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు తెలిపారు. మున్నూరుకాపులకు కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఏజెన్సీ ప్రాంత గౌడ కులస్తులకు ఎస్టీ సర్టిఫికెట్ ఇస్తున్నా సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారు తప్పుడు కుల సర్టిఫికెట్లతో చేపలు పడుతుండగా గంగపుత్రులు తీవ్రంగా నష్టపోతున్నందున రూ.5వేల పెన్షన్ ఇప్పించి బీమా కల్పించాలని ఆ సంఘం నాయకులు కోరారు. అలాగే, వడ్డెరలకు జరుగుతున్న అన్యాయాన్ని ఆ సంఘ నేతలు వివరించగా బీసీ కులాలు, ఉపకులాలకు సంబంధించి మొత్తం 79 మంది తమ వాదనలను వినిపించారు.

అవకాశాలు కల్పించండి

బీసీ సంఘాల నేతలు వెల్లడించిన అంశాలు, అందజేసిన వినతుల ఆధారంగా ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ తెలిపారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగానే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేయిస్తోందన్నారు. ఈ సర్వేలో ప్రజలు వివరాలన్నీ నమోదు చేయించుకోవాలని సూచించారు.

స్వామి ఆశీస్సులతో...

ఖమ్మం చేరుకున్నాక తొలుత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విచారణకు హాజరయ్యామని చైర్మన్ నిరంజన్ తెలిపారు. ఆతర్వాత పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పించామని, పేదల అభ్యున్నతి కోసం ఆమె హయాంలో అనేక విప్లవాత్మకమైన చర్యలు తీసుకున్నారని చెప్పారు. బ్యాంకుల జాతీయీకరణతో చిన్న వ్యాపారులు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు బ్యాంకులు దగ్గరయ్యాయని తెలిపారు.

సర్వే సమాజ భవిష్యత్‌కు సంబంధించిన అంశం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రభుత్వం చేయిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమాజ భవిష్యత్‌కు సంబంధించిన అంశమని, ఇది వెనుకబడిన వర్గాలకు తోడ్పాటునందిస్తుందని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీల్లో పెద్ద కులాలకే తప్ప చిన్న కులాలకు అవకాశాలు దక్కడం లేదన్న అంశం తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేపై ఎవరూ అపోహలు, ఆందోళనలు పెట్టుకోవద్దని, సర్వేలో ప్రజలకు అన్యాయం జరిగితే కమిషన్ చూస్తూ ఊరుకోదన్నారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, కుటుంబీకులు తప్పుడు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ చర్యలు ఉంటాయని తెలిపారు. కాగా, మళ్లీ ఎప్పుడు సర్వే జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో ఎవరూ అపోహలు సృష్టించొద్దని, రూ.కోట్ల వ్యయంతో చేస్తున్న పని వృథా కాకుండా అధికారులు సామాజిక బాధ్యతగా పూర్తి చేయాలన్నారు. సర్వేలో వెల్లడయ్యే సమాచారంతో నివేదికను వచ్చేనెల 9న హైకోర్టుకు అందజేయనున్నామని చైర్మన్ వెల్లడించారు. అలాగే, తమ కమిషన్ విచారణ పూర్తయ్యాక ఈ నెలాఖరు నాటికి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. కాగా, సంచార జాతుల వారు బీసీలతో తమకు సంబంధం లేదని పేర్కొనగా, రజకులను ఎస్సీల్లో చేర్చాలని, దూదేకులు ఫెడరేషన్ లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, బీసీ కులాల పరిరక్షణకు బీసీ అట్రాసిటీ యాక్ట్ తీసుకురావాలని కొందరు కోరారని చెప్పారు. నాలుగేళ్ల క్రితం మాదిరి గ్రామ బహిష్కరణలు జరుగుతున్నాయని, బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతోందని పలువురు పేర్కొనగా... ఇతర కార్పొరేషన్లను సొసైటీ యాక్ట్ ప్రకారం ప్రకటించి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను కంపెనీస్ యాక్ట్ ప్రకారం చేసినట్లు తమ దృష్టికి తీసుకొచ్చారని చైర్మన్ తెలిపారు.

కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



రామకృష్ణాపురంలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని, తద్వారా ఉన్నత విద్యకు ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. చింతకాని మండలంలోని రామకృష్ణాపురం, పందిళ్లపల్లి, నేరడ ఉన్నత పాఠశాలల్లో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌లను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. దాతల చేయూతతో సమకూర్చిన కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ట్రస్టీ ఫణికుమార్, తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఎంఈఓలు వీరపనేని శ్రీనివాసరావుతోపాటు పిన్నెల్లి వెంకటేశ్వర్లు, వంశీ, అభిలాష్, కార్తీక్, సూర్య, ఈశ్వర్, శ్రవణ్, అమూల్యరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నవోదయ' దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో వచ్చే విద్యాసంవత్సరానికి 9, 11వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తుల గడువు మరోమారు పొడిగించారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారంతో ముగిసిన గడువును 26వ తేదీ వరకు పొడిగించినందున అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం

ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఈ-కేవైసీలో ఆధార్ సంబంధిత సేవలకు అంతరాయం ఏర్పడడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మంగళవారం మధ్యాహ్నం 12నుండి 3 గంటల వరకు రిజిస్ట్రేషన్లు జరగలేదు. ఉమ్మడి జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ పలు సేవలకు అంతరాయం ఏర్పడింది. ఆధార్ సర్వర్‌లో తలెత్తిన సమస్యతో రాష్ట్రవ్యాప్తంగా ఈ పరిస్థితి నెలకొందని అధికారులు వెల్లడించారు.

రూ.63.94 కోట్ల ఆదాయమే లక్ష్యం

- లైసెన్స్ లేని పత్తి వ్యాపారులకు నోటీసులు
- జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్



ఏన్కూరు : వ్యాపారులతో సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఓ అలీమ్

ఏన్కూరు/తల్లాడ: జిల్లాలోని ఎనిమిది వ్యవసాయ మార్కెట్ల ద్వారా ఈ ఏడాది రూ.63.94 కోట్ల ఆదాయం సాధించడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామని జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ.అలీమ్ తెలిపారు. ఏన్కూరు వ్యవసాయ మార్కెట్‌లో జూలూరుపాడు, ఏన్కూరు వ్యాపారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా డీఎంఓ మాట్లాడుతూ ఇప్పటి వరకు మార్కెట్ల ద్వారా వివిధ రూపాల్లో రూ 31.74 కోట్ల ఆదాయం సమకూరగా, మార్చి నాటికి లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. కాగా, పంటల కొనుగోలు విషయంలో వ్యాపారులు నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. ప్రతిరోజు ఉదయం 7–30 గంటలకల్లా జెండా పాట పూర్తిచేయాలని, రైతులకు నగదు ఏ రోజుకారోజు చెల్లించాలని సూచించారు. కాగా, తల్లాడలోని చెక్‌పోస్టును తనిఖీ చేసిన డీఎంఓ మాట్లాడారు. తల్లాడలో ముగ్గురు వ్యాపారులే లైసెన్స్ తీసుకుని పత్తి కొనుగోళ్లు చేపడుతుండగా, మిగతా వారికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. జిల్లాలోని తొమ్మిది సీసీఐ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 4 వేల మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించిన రైతులకు నాలుగు రోజుల్లో డబ్బు జమ అవుతోందని తెలిపారు. ఈసమావేశాల్లో మార్కెట్ కార్యదర్శులు బి.బజారు, మోసీనా సుల్తానా, ఉద్యోగులు రామారావు, అనూష, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు

ముదిగొండ: రైతులకు ఇబ్బందులు కలగకుండా పత్తి కొనుగోళ్లు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా ఆయన మాట్లాడగా ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురంలోని సీసీఐ కొనుగోలు కేంద్రం నుంచి అధికారులు హాజరయ్యారు. ఈమేరకు పత్తి కొనుగోళ్లపై సమీక్షించిన మంత్రి పలువురు రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నిర్దేశిత శాతం తేమ నమోదు రాగానే పత్తి కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీమ్, నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వి.సీతారాములు, మధిర ఏడీఏ విజయ్‌చంద్ర, ఏఓ వేణు పాల్గొన్నారు.

21న 'లగచర్ల' బాధితులకు సంఘీభావ ర్యాలీ

- హాజరుకానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు
- 22న మార్కెట్ సందర్శన, పలు కుటుంబాలకు పరామర్శ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, పక్కన సండ్ర తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఈనెల 21, 22వ తేదీల్లో జిల్లాలో పర్యటిస్తారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ వెల్లడించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజుతో కలిసి మంగళవారం ఆయన మాట్లాడారు. లగచర్ల బాధితులకు సంఘీభావంగా ఈనెల 21న సాయంత్రం ఖమ్మం పెవిలియన్ మైదానం నుండి జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు జరిగే కొవ్వొత్తుల ర్యాలీలో హరీశ్‌రావు పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు గిరిజనులు, పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. అలాగే, 22న ఉదయం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను హరీశ్‌రావు నేతృత్వాన బీఆర్‌ఎస్ బృందం సందర్శించి పత్తి, మిర్చి రైతులతో మాట్లాడతారని తెలిపారు. అనంతరం చింతకాని మండలం ప్రొద్దుటూరు, లచ్చగూడెంల్లో పర్యటించి ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలతో పాటు ఇటీవల అరెస్ట్ అయిన బీఆర్‌ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారని వెల్లడించారు. ఈ సమావేశంలో నాయకులు ఖమర్, గుండాల కృష్ణ, వెంకటరమణ, బిచ్చాల తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ లేకపోతే ప్రైవేట్ ఆస్పత్రుల సీజ్

ఖమ్మంవైద్యవిభాగం: ప్రైవేట్ ఆస్పత్రులను రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహించడం చట్టవిరుద్ధమని, అలాంటి ఆస్పత్రులను సీజ్ చేస్తామని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి స్పష్టం చేశారు. ఖమ్మంలోని వెంకటేశ్వర నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఫార్మసీ, ల్యాబ్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. స్థానికులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అలాగే, యాంటీ బయోటిక్స్ ఎక్కువగా వాడొద్దని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు నిబంధనలు పాటిస్తూ ప్రజలు ఇబ్బంది పడకుండా చికిత్స చేయాలని సూచించారు. ఆస్పత్రులపై నిఘా ఉన్నందున నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని చెప్పారు. ఆతర్వాత కేఎంసీ సమావేశ మందిరంలో ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లకు సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలు, 'యూ విన్' యాప్‌పై ఇచ్చిన శిక్షణలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల ఇమ్యూనైజేషన్ అధికారులు చందూనాయక్, లక్ష్మీనారాయణ, ప్రోగ్రాం అధికారులు రామారావు, వెంకటరమణతో పాటు డాక్టర్ జ్యోత్స్న, డేవిడ్ తదితరులు హాజరయ్యారు.



ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

డైట్.. కిటకిట !

- ఉపాధ్యాయ ఉద్యోగాలపై ఆసక్తితో ప్రవేశాలు
- ఈ ఏడాది 97 మంది అభ్యర్థుల కేటాయింపు
- రెండో విడత కౌన్సెలింగ్‌తో 100సీట్లు భర్తీ అయ్యే అవకాశం



డైట్ కళాశాల ముఖద్వారం

ఖమ్మం సహకారనగర్: గతంతో పోలిస్తే డైట్ కళాశాలలో ఈ ఏడాది ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ ఏడాది ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహించడం.. త్వరలోనే మళ్లీ నిర్వహిస్తామనే ప్రకటనతో డైట్ కళాశాలలో ప్రవేశాల సంఖ్య పెరిగిందని భావిస్తున్నారు. ఖమ్మం డైట్‌లో 100 సీట్లు ఉండగా.. ఇప్పటి వరకు 97 మందిని కౌన్సెలింగ్ ద్వారా కేటాయించారు. వీరిలో 72 మంది కళాశాలలో చేరారు.

ఎలిమెంటరీ ఉపాధ్యాయులుగా..

డైట్(డిస్ట్రిక్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్) కళాశాలలో కోర్సు పూర్తిచేయడం ద్వారా ఒకటి నుంచి 5వ తరగతి వరకు బోధించేందుకు అర్హత లభిస్తుంది. గతంలో దీనిని డీఎడ్(డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్)గా పిలిచేవారు. తాజాగా ఈ పేరును డీఎల్‌ఈడీ(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్)గా మార్చారు. ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన విద్యార్థులు ప్రవేశపరీక్ష రాస్తే మార్కుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి డీఎల్‌ఈడీలో ప్రవేశం కల్పిస్తారు. రెండేళ్ల కాలపరిమితితో ఈ కోర్సు పూర్తిచేశాక టెట్ అర్హత సాధించి డీఎస్సీ రాస్తే ఉపాధ్యాయులుగా ఎంపికయ్యే అవకాశం లభిస్తుంది.

ఉమ్మడి జిల్లాలో ఏకైక కళాశాల

ఉమ్మడి జిల్లా అంతటికీ ఖమ్మం టేకులపల్లిలో డైట్ కళాశాల ఉంది. ఇక్కడ మొత్తం 100 సీట్లు ఉన్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి. గత పదేళ్లలో అడపాదడపా మినహా ఈ స్థాయిలో ప్రవేశాలు పొందిన సందర్భాలు లేవనే చెప్పాలి. ఇక 2016–18 విద్యాసంవత్సరానికి ఒక సీటు కూడా భర్తీ కాలేదు. ఆ తర్వాత ఏడాది మాత్రం 91 మంది విద్యార్థులు చేరారు. ఆపై మళ్లీ ప్రవేశాలు తగ్గుముఖం పడుతున్నాయి. కానీ ఈ ఏడాది మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తికాగా 97మందికి ఖమ్మం డైట్ కళాశాలను కేటాయించారు. ఇందులో 75 మంది చేరారు. త్వరలోనే రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనుండగా మొత్తం సీట్లు భర్తీ అవుతాయని భావిస్తున్నారు.

డీఎల్‌ఈడీ వైపు అడుగులు..


2013, 2017 సంవత్సరాలతో పాటు ఈ ఏడాది డీఎస్సీ నిర్వహించారు. త్వరలో టెట్ నిర్వహించే అవకాశముంది. అంతేకాక ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం వెల్లడించింది. దీంతో కొన్నేళ్లుగా డీఎల్‌ఈడీపై అంతగా ఆసక్తి చూపని విద్యార్థులు ఈసారి ఇటు వైపు దృష్టి సారించారు. డీఎల్‌ఈడీ కోర్సు పూర్తి చేసి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతోనే పలువురు చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని అధ్యాపకులు భావిస్తున్నారు.

డైట్ కళాశాలలో గత కొన్నేళ్లుగా ప్రవేశాల వివరాలు

విద్యాసంవత్సరం	విద్యార్థులు
2013-2015	98
2014-2016	97
2015-2017	99
2016-2018	00
2017-2019	91
2018-2020	76
2019-2021	54
2020-2022	50
2021-2023	35
2022-2024	44
2023-2025	34
2024-2026	97



97 మందిని కేటాయించారు...



డైట్ కళాశాలలో వంద సీట్లకుగాను ఈ ఏడాది మొదటి విడతగా 97 మందిని కేటాయించారు. వీరిలో 72 మంది చేరగా మిగతా వారు త్వరలో చేరే అవకాశముంది. ఇక రెండో విడత కౌన్సెలింగ్ తర్వాత పూర్తి సీట్లు భర్తీ అవుతాయని భావిస్తున్నాం. ఎంతో భవిష్యత్ ఉండే కోర్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– సామినేని సత్యనారాయణ, ప్రిన్సిపాల్, డైట్

క్లుప్తంగా

24న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల అథ్లెటిక్స్ జట్ల ఎంపికకు ఈనెల 24న పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని మంచిర్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సూచించారు.

జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్


రామకృష్ణ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం మమత రోడ్డులో నివాసముంటున్న కావటి రామకృష్ణకు డాక్టరేట్ లభించింది. కల్లూరు మండలం క్రిష్ణయ్య బంజరకు చెందిన కావటి గోపాలరావు – జయమ్మ కుమారుడైన రామకృష్ణ విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ కే.వీ.రమణమూర్తి పర్యవేక్షణలో పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించారు. ఈమేరకు హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ నుంచి డాక్టరేట్ ప్రకటించగా పలువురు రామకృష్ణను అభినందించారు.

సత్తుపల్లిలో స్కూల్ బస్సు సీజ్

సత్తుపల్లి: సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సును రవాణాశాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. ఖమ్మంలోని శ్రీ చైతన్య పాఠశాల పేరిట బస్సు రిజిస్టర్ అయి ఉండగా, 60కి.మీ. పరిధిలోనే నడపాల్సి ఉంటుంది. కానీ సత్తుపల్లి విద్యాలయం అవసరాలకు అనుమతి లేకుండా వినియోగిస్తున్నారు. ఈమేరకు పర్మిట్ నిబంధనలు అతిక్రమించినట్లు తేలడంతో సీజ్ చేయడమే కాక కేసు నమోదు చేశామని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు


బెల్లం పానకం డ్రమ్ములు, నిందితుడితో ఎక్సైజ్ ఉద్యోగులు

కారేపల్లి: గుడుంబా స్థావరాలపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసి నాటుసారా స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కరుణశ్రీ తెలిపిన వివరాలు... మండలంలోని మంగళితండాలో చేన్ల మధ్య గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఉద్యోగులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు రెండు స్థావరాల్లో ఆరు లీటర్ల నాటు సారా, ఐదు కేజీల బెల్లం, రెండు కేజీల పట్టిక స్వాధీనం చేసుకుని 250లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అలాగే, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణశ్రీ తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ సరిత, ఉద్యోగులు మధుసూదన్, వలరాజు, రాణా ప్రతాప్, విశ్వనాథం, నరేష్, నిర్మల, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆటో, వ్యాన్ ఢీ - కూలీలకు గాయాలు


ప్రమాదంలో గాయపడిన ఈశ్వరమ్మ

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం–బిల్లుపాడు మధ్య మంగళవారం రాత్రి ఆటో, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొనడంతో పలువురు కూలీలు గాయపడ్డారు. తల్లాడ మండలం రామచంద్రాపురానికి చెందిన 18 మంది కూలీలు పత్తి తీతకు ఏన్కూరు వెళ్లి తిరిగి వస్తుండగా చీకటి పడింది. ఈక్రమాన వీరి ఆటోను వేగంగా వచ్చిన టాటా ఏస్ ఢీకొట్టడంతో కూలీలు గాయపడ్డారు. వీరిలో పులి లక్ష్మి, కందుల ఈశ్వరమ్మ, పడాల ధనమ్మకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో ఖమ్మం తరలించారు. మరో 15 మందికి స్వల్ప గాయాలు కాగా స్థానికంగా చికిత్స చేయిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,800	6,450
మిర్చి	14,900	6,500
మిర్చి తాలు	6,800	6,800
ఏసీ మిర్చి	17,000	6,800
పత్తి	6,750	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,144

మిరపను ఆశిస్తున్న 'నల్ల నల్లి'

ఈ ఏడాది మిర్చి పంట ఆశాజనకంగా ఉందని భావిస్తుండగా నల్ల నల్లిగా పిలిచే పూత తామర పురుగు ఆశిస్తుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. మిర్చి పూత, కాత దశకు చేరగానే నల్ల నల్లి ఆశిస్తుండడంతో పంటకు నష్టం జరుగుతుందని చెబుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 59,144 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. చాలాచోట్ల తోటల్లో పూతపై తామర పురుగు ప్రభావం కనిపిస్తుండగా, రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ.మధుసూదన్ రైతులకు సూచనలు చేశారు. – ఖమ్మంవ్యవసాయం


కూసుమంచి మండలంలో మిర్చి తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్

- ఆకులు, పూత, కాయ రసాన్ని పీలుస్తుండడంతో పంటకు నష్టం
- అంతేకాక రాలిపోతున్న పూత, కాత

సస్యరక్షణ చర్యలపై అధికారుల సూచనలు


తామర పురుగు(నల్ల నల్లి) ఆశించిన మిరప తోట

సాధారణ తామర పురుగులు

లార్వా, పురుగు, ప్రధానంగా ఆకుల అడుగుభాగం, కాయల నుండి రసాన్ని పీల్చడం ద్వారా పంటను దెబ్బతీస్తాయి. తద్వారా ఆకులు వంకరతిరిగి పైకి ముడుచుకుని, ఎండిపోవడమే కాక పూలు రాలిపోతాయి. అలాగే, మొక్క గిడసబారడం, కాయలపై గోకిన మరకలు ఏర్పడతాయి. ఈ పురుగులు నీటి పారుదల లేని, పొడి వాతావరణ పరిస్థితుల్లో అధికంగా ఆశిస్తుంది.

తామర పురుగులు (నల్ల నల్లి)

ఈ పురుగులు ప్రధానంగా పువ్వులు, ఆకుల అడుగు భాగంలో గుంపులుగా ఆశిస్తాయి. లార్వా ఆకుల దిగువ నుండి రసాన్ని పీలుస్తుంది. పూత అధికంగా రాలిపోతుండడంతో కాయ ఉత్పత్తి తగ్గుతుంది. ఇతర తామర పురుగుల జాతులకు భిన్నంగా ఈ పురుగు ఈశాన్య రుతుపవనాల వల్ల కలిగే వర్షపాత సమయాన ఎక్కువగా ఆశిస్తుంది.


నల్లితో దెబ్బతిన్న కాత, పూత

నియంత్రణ, యాజమాన్య పద్ధతులు



- పంటల సీజన్‌ను ముందుకు తీసుకెళ్లడం ద్వారా పూత సమయాన తామర పురుగులు ఆశించకుండా కాపాడుకోవచ్చు.
- ఈ పురుగును తట్టుకోగలిగే అందుబాటులో ఉన్న రకాలు లేదా స్వల్ప కాల వ్యవధి గల రకాలను సాగు చేసుకోవాలి.
- కలుపు మొక్కలు పంట పొలాల చుట్టూ, గట్లపై లేకుండ చూడాలి.
- ఇమిడాక్లోప్రిడ్ 8 గ్రాములను కేజీ విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.
- ఎకరాకు 200 కేజీల వేప చెక్క, 500 కేజీల వర్మీ కంపోస్ట్ అందించాలి.
- మొక్కలు ప్రధాన పొలంలో నాటాక 15రోజులకు ఫిప్రోనిల్ 10ఏ గుళికలు వేయాలి.
- సిఫారసు మేరకు మొక్కలకు పొటాష్ ఎరువు వేస్తూనే అధిక మొత్తం నత్రజని ఎరువుల వినియోగాన్ని నివారించాలి.
- ఈ పురుగు కోశస్త దశలను మట్టిలో తగ్గించడానికి, 25–30 మైక్రాన్ల మందం కలిగిన వెండి రంగు పాలిథిన్ ఫీట్లతో మల్చింగ్ ఏర్పాటుచేయాలి.
- మిరప నాటడానికి 3–4 వారాల ముందు పంట చుట్టూ 2–3 వరుసల్లో పొడవుగా పెరిగే జొన్న, మొక్కజొన్న, సజ్జ, పశుగ్రాస గడ్డి విత్తనాలు వేయాలి.
- మిరపలో మొక్కజొన్న, జొన్న, బొబ్బెరను అంతర పంటగా 10:3:1 వరుసల్లో వేసుకోవాలి.
- అంతర కృషి చేయడం ద్వారా కూడా మట్టిలోని కోశస్త దశలను నివారించవచ్చు.
- పురుగు తీవ్రంగా ఆశించిన మొక్కలను పీకి గుంతలో పాతిపెట్టడం పెట్టడమా లేదా కాల్చడమో చేయాలి.
- సామూహిక నివారణ కోసం నీలి జిగురు అట్టలను ఎకరాకు 40- 50 చొప్పున ఏర్పాటు చేయాలి.
- సాధ్యమైనంత వరకు డ్రిప్ విధానంలో సాగు నీరు అందించాలి.

దేశాభివృద్ధిని పరుగులు పెట్టించిన ఇందిరాగాంధీ


ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: ప్రధానిగా ఇందిరాగాంధీ చేపట్టిన సంస్కరణలో దేశాభివృద్ధి పరుగులు తీసిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ వెల్లడించారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం ఖమ్మం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఆమె విగ్రహంతో పాటు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎన్నో సంస్కరణలకు బీజం వేయడమే కాక మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు, ప్రజాప్రతినిధులు దొబ్బల సౌజన్య, నాగండ్ల దీపక్‌చౌదరి, పుచ్చకాయల వీరభద్రం, కొత్తా సీతారాములు, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్‌గౌడ్, బొడ్డు బొందయ్య, లకావత్ సైదులు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు వెంకటేశ్వర్లు, రాపర్తి శరత్, పాలకుర్తి నాగేశ్వరరావు, మద్దినేని రమేష్, ఎండీ.పాషా, బాణాల లక్ష్మణ్, సూర్యనారాయణ, ప్రతిభారెడ్డి, ఇబ్రహీం పాల్గొన్నారు.

ఈ బిడ్డ.. బంగారు 'కొండ'!

ఖమ్మంలో 4.1 కేజీల శిశువు జననం


4.1 కేజీల బరువైన శిశువు


బాలింత సుజాతతో వైద్యులు, సిబ్బంది

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ మహిళ 4.1 కేజీల మగ శిశువుకు జన్మనిచ్చింది. ఏపీలోని చింతలపూడికి చెందిన ఎస్.సుజాత ప్రసవం కోసం సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా, ఆమె మూడో కాన్పు కావడం, బీపీ తదితర సమస్యలు ఉండటంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈమేరకు మంగళవారం వైద్యులు ఇందు, జ్యోత్స్న ఆధ్వర్యాన ఆమెకు సాధారణ ప్రసవం చేయడంతో మగశిశువు జన్మించాడు. మూడో కాన్పులో బరువైన శిశువు జన్మించడం అరుదని, ఆరోగ్య సమస్యలు ఉన్నా జాగ్రత్తగా కాన్పు చేసిన వైద్యులు, సిబ్బంది స్వరూపరాణి, అయేషా, కలైనను సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓ రాంబాబు అభినందించారు.

ఇద్దరు మహిళలను కుటుంబాలకు అప్పగించిన 'అన్నం'


రేణుకను కుటుంబీకులకు అప్పగిస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయిన ఇద్దరు మహిళలకు ఆశ్రయం కల్పించడమే కాక వారు కోలుకున్నాక వివరాలు ఆరా తీసిన అన్నం ఫౌండేషన్ బాధ్యులు కుటుంబాలకు చెంతకు చేర్చారు. వివరాలిలా ఉన్నాయి. భద్రాచలంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న రేణుక వెంట చంటిపాప ఉండగా, అక్కడి అధికారుల సూచనతో ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు తరలించి వైద్యం చేయించారు. ఆమె కోలుకున్నాక తనది నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రమని చెప్పడంతో అక్కడి పోలీసుల ద్వారా నిర్ధారించుకున్నారు. అలాగే, మరో మహిళ ఖమ్మం రూరల్ మండలం జలగంనగర్‌లో తిరుగుతుండడంతో ఆశ్రయం కల్పించి నెమ్మదిగా వివరాలు ఆరా తీశారు. ఆమె మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేములకు చెందిన నాగమణిగా చెప్పడంతో అక్కడికి ఫోన్ చేయగా నిజమేనని తేలింది. దీంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు మంగళవారం వాహనంలో ఇద్దరు మహిళలను తీసుకెళ్లి వారి కుటుంబానికి అప్పగించగా కృతజ్ఞతలు తెలిపారు.

ఏకగ్రీవంగా విద్యుత్ ఇంజనీర్ల సంఘం ఎన్నిక


కె.హీరాలాల్


వై.వీ.ఆనంద్


జీవన్‌కుమార్

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఖమ్మంలోని విద్యుత్ గెస్ట్‌హౌస్‌లో ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా ఖమ్మం సర్కిల్‌లో కన్‌స్ట్రక్షన్స్ డీఈ కె.హీరాలాల్, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కార్యదర్శులుగా కొత్తలింగాల ఆపరేషన్స్ ఏడీఈ వై.వీ.ఆనంద్‌కుమార్, భద్రాచలం ఆపరేషన్స్ డీఈ కె.జీవన్‌కుమార్ ఎన్నికయ్యారు. అలాగే, ఉమ్మడి జిల్లా అదనపు కార్యదర్శులుగా టి.కిరణ్‌కుమార్(ఏడీఈ డీఎస్ ఖమ్మం), ఏ.కోటేశ్వరరావు(ఆపరేషన్స్ ఏడీఈ ఇల్లెందు), పి.కృష్ణారావు(బూడిదంపాడు ఏడీఈ –ట్రాన్స్‌కో), ఉమ్మడి జిల్లా కోశాధికారి పి.సుబ్బారావు(ఏడీఈ ఖమ్మం టౌన్ ఓఎంసీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి, డీఈ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో భూమి వివరాలు లేవని ఆందోళన

బోనకల్: పట్టాదారు పాస్‌పుస్తకంలో భూమి వివరాలు ఉన్నా సర్వే నంబర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంపై రైతులు తహసీల్ ఎదుట మంగళవారం కుటుంబాలతో సహా ఆందోళన నిర్వహించారు. మండలంలోని రావినూతలకు చెందిన ఎరగాని కొండలు, ఎరగాని కృష్ణయ్య, ఎరగాని వెంకటేశ్వర్లుకు నారాయణపురం రెవెన్యూలోని 236, 237 సర్వేనంబర్లలో 2.39కుంటల భూమి ఉంది. 2019లో పట్టాదారు పాస్‌పుస్తకాలు అందడంతో సాగు చేసుకుంటున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేశాక బ్యాంక్‌లో సంప్రదిస్తే వ్యవసాయశాఖ అధికారుల వద్దకు వెళ్లాలని సూచించారు. దీంతో ఏఓ, తహసీల్దార్ వద్దకు వెళ్లగా పట్టాదారు పాస్‌పుస్తకంలో భూమి వివరాలు ఉన్నా ఆన్‌లైన్‌లో లేవని, డిలీషన్ జాబితాలో చేర్చడంతోనే ఇలా జరిగిందని తెలిపారు. అప్పటి నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో తహసీల్ ఎదుట ఆందోళనకు దిగారు. అయితే, త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ పున్నంచందర్ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తదితరులు రైతులకు సంఘీభావం తెలిపారు.

శబ్దకాలుష్యానికి కారణమవుతున్న సైలెన్సర్ల తొలగింపు


తొలగించిన సైలెన్సర్లను పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మంక్రైం: వాహనాలకు కంపెనీ అమర్చిన సైలెన్సర్లను తొలగించి పెద్ద శబ్దాలు చేసేవి బిగిస్తూ ఇతరులను ఇబ్బంది పెడుతున్న వాహనదారుల కట్టడిపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. ఈమేరకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ఆధ్వర్యాన ఖమ్మంలో మంగళవారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 25 వాహనాల సైలెన్సర్లను తీయించి వాహనదారులకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ కొందరు ద్విచక్రవాహనాలకు సంస్థ అమర్చిన సైలెన్సర్లకు బదులు అమరుస్తున్న వాటితో ధ్వని కాలుష్యం ఏర్పడడమే కాక ఇతర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈవిషయమై అందిన ఫిర్యాదులతో డ్రైవ్ చేపట్టామని, ఇది నిరంతరం కొనసాగుతుందని వెల్లడించారు. అలాగే, లైసెన్సు తీసుకోని, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐ మోహన్‌బాబు, ఆర్‌ఐ సాంబశివరావు, ఎస్‌ఐలు సాగర్, రవి, వెంకన్న, రాము పాల్గొన్నారు.

అటు ఝాన్సీలక్ష్మి.. ఇటు ఇందిరాగాంధీ!


విద్యార్థినులతో ఉపాధ్యాయులు

కారేపల్లి: వీరనారి ఝాన్సీలక్ష్మీబాయి, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని కారేపల్లి మండలం రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇద్దరు విద్యార్థినులు ఝాన్సీలక్ష్మీబాయి, ఇందిరాగాంధీ వేషధారణలో హాజరై ఆకట్టుకున్నారు. అనంతరం ఇన్‌చార్జి హెచ్‌ఎం డి.బిక్షం మాట్లాడుతూ వారి జీవితచరిత్రను వివరించారు. డిప్యూటీ వార్డెన్ బి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు బి.వెంకటేష్, ఎం.రాంబాబు, డి.వీరన్న, సీహెచ్.వెంకటేశ్వర్లు, జి.వీరన్న, ఎం.శివ, డి.తార పాల్గొన్నారు.

డాక్టర్ జమలాపురం హరగోపాల్ మృతి


హరగోపాల్ (ఫైల్)

ఖమ్మంగాంధీచౌక్: లండన్‌లో వైద్య వృత్తిలో కొనసాగుతున్న జిల్లాలోని ఎర్రుపాలెంకు చెందిన జమలాపురం హరగోపాల్(79) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడడమే కాక స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న జమలాపురం కేశవరావు తనయుడైన హరగోపాల్ సుదీర్ఘకాలంగా లండన్‌లో వైద్య వృత్తి నిర్వర్తిస్తుండగా, కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ మేరకు సోమవారం మృతి చెందిన ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. హరగోపాల్ మృతిపై నియోగి బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోసూరు ప్రసాద్, గెంటేల శ్రీనివాసరావుతో పాటు కేశవరావు, వీఎల్.నర్సింహారావు, మాటూరి లక్ష్మీనారాయణ, మంగ్రప్రగడ జగన్మోహన్‌రావు, పలివెల సుబ్బారావు తదితరులు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

వేలం వాయిదా

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలకు టెండర్‌దారులు ఎవరూ రానందున వాయిదా వేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఎప్పుడు వేలం ఉంటుందో త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

రఘునాథపాలెం: భర్త, అత్తామామలు అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైన వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపిన వివరాలు... ఈర్లపుడికి చెందిన గుగులోతు బాలాజీతో మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం ముట్టితండాకు చెందిన అనూష(28)తో 2018లో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమార్తెలు. కొంతకాలంగా అనూషను ఆమె భర్తతో పాటు అత్తామామలు భద్రి, మంగ్య అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఈనెల 6న ఇంట్లో ఉరి వేసుకోగా, గమనించిన కుటుంబీకులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందగా అనూష తండ్రి రూప్‌సింగ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

అల్లీనగరంలో చోరీకి యత్నం

- పోలీసుల తీరుపై స్థానికుల విమర్శలు

మధిర: మధిర మండలం అల్లీనగరంలో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి యత్నించాడు. మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు గ్రామంలోకి వచ్చిన నిందితుడు విద్యుత్ అధికారి ఇంట్లో చోరీకి ప్రయత్నిస్తుండగా స్థానికులు గుర్తించి చాకచక్యంగా బంధించారు. ఆపై ఆయనను కట్టేసి పోలీసులకు సమాచారం ఇస్తే మూడు గంటల అనంతరం వచ్చి తీసుకెళ్లాలని గ్రామస్తులు ఆరోపించారు. ఆలోపు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహించాలని ప్రశ్నించారు. గతంలో జరిగిన చోరీ కేసుల్లో నిందితులను పట్టుకోకపోగా, తాము నిందితుడిని బంధించినా సకాలంలో రాకపోవడంపై టౌన్ పోలీసులు తీరును తప్పుపట్టారు. కాగా, కొద్దిరోజులుగా మధిర పరిసరాల్లో వరుస చోరీలు జరుగుతున్నందున ఇకనైనా నిఘా పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

కల్వర్టులో బోల్తా పడిన లారీ

- తప్పిన పెను ప్రమాదం


రహదారి పక్కనే కల్వర్టులో పడిన లారీ

కొణిజర్ల: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమాన లారీ అదుపు తప్పగా కల్వర్టులో పడింది. స్థానికులు, డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్ నుంచి ఏపీలోని వైజాగ్‌కు మరమరాల లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ మంగళవారం తెల్లవారుజామున కొణిజర్ల పోలీస్‌స్టేషన్ వద్ద ఎదురుగా వస్తున్న మరో లారీని తప్పించేందుకు ప్రయత్నించాడు. ఈక్రమంలో పక్కకు తిప్పడంతో రహదారి వెంటే ఉన్న కల్వర్టులో పడింది. అయితే, అక్కడి చెట్టును ఆనుకుని ఆగడంతో డ్రైవర్, క్లీనర్‌తో పాటు మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. కల్వర్టు రోడ్డుకన్నా దిగువకు ఉండడం, సమీపానికి వచ్చే వరకు కనిపించకపోవడం, రక్షణ గోడ లేనందున తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ఖమ్మం కైకొండాయిగూడెంకు చెందిన తురక నాగరాజుకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం ప్రొహిబిషన్, ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఆర్.శాంతిలత మంగళవారం తీర్పు చెప్పారు. ఖమ్మం చెరువుబజార్‌కు చెందిన బుద్దా వేణు వద్ద నాగరాజు 2013 అక్టోబర్ 9న రూ.2.10లక్షల అప్పు తీసుకున్నాడు. ఈ నగదు తిరిగి ఇవ్వాలని కోరగా 2015 జూన్ 30న చెక్కు జారీ చేశాడు. అయితే, ఆ చెక్కును బ్యాంకులో సమర్పించగా నాగరాజు ఖాతాలో సరిపడా నగదు లేక బౌన్స్ అయింది. ఈ మేరకు న్యాయవాది జమ్మి వెంకటేశ్వర్లు ద్వారా కోర్టులో కేసు దాఖలు చేయడంతో విచారణ అనంతరం నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- ఖమ్మం వాసులు అన్నవరం వెళ్లొస్తుండగా ప్రమాదం

అనకాపల్లి: ఏపీలో జరిగిన ప్రమాదంలో ఖమ్మంకు చెందిన ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. అనకాపల్లి సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలు... ఖమ్మం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కాలనీకి చెందిన అశోక్‌కుమార్ – పద్మావతి దంపతుల కుమార్తె వివాహం ఆదివారం విశాఖలో జరిగింది. అనంతరం సోమవారం అశోక్‌కుమార్, పద్మావతి, రామలింగం – అన్నపూర్ణతో పాటు లక్ష్మీ శ్రీకరి కారులో అన్నవరం వెళ్లి మంగళవారం తిరిగి బయలుదేరారు. వీరంతా విశాఖ వస్తుండగా అనకాపల్లిలోని డైట్ కళాశాల సమీపాన ఆగి ఉన్న లారీని కారు ఢీకొనగా ఐదురురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం విశాఖ ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

గొర్రెలపైకి దూసుకెళ్లిన లారీ

- 15 జీవాలు మృతి


మృతి చెందిన గొర్రెల వద్ద రోదిల్లుతున్న కాపరులు

ఏన్కూరు: గొర్రెలపై లారీ దూసుకెళ్లడంతో 15జీవాలు మృతి చెందిన ఘటన ఏన్కూరు మండలం జన్నారం సమీపాన మంగళవా రం జరిగింది. నారాయణపేట జిల్లా ధన్వాడకు చెందిన శివకోటయ్య, మల్లేశ్, నరేష్, కొండలప్ప తమ గొర్రెలను మేత కోసం ఈ ప్రాంతానికి వచ్చారు. జన్నారం రైతువేదిక సమీపాన గొర్రెలను తీసుకెళ్తుండగా ఏన్కూరు నుండి పల్లిపాడు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి గొర్రెల గుంపుపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో 15 జీవాలు మృతి చెందగా, 14 గొర్రెలు గాయపడ్డాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

కూసుమంచి: మండలంలోని రాజుపేట బజార్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన రెడ్డెబోయిన కృష్ణయ్య ఇంట్లో ఈ ప్రమాదం జరగగా సామగ్రి, గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా, ఘటనలో రూ.లక్షల్లో ఆస్తినష్టం జరిగిందని బాధిత కుటుంబం వాపోయింది.

తొలగింపు కుదరదు..
ఇకపై వద్దు

▶ మొదటి పేజీ తరువాయి



ప్రవేశపెట్టిన సర్వీస్ రూల్స్ ద్వారా భర్తీ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ సర్వీస్ నిబంధనల్లోని రూల్ 3.. జూనియర్ లెక్చరర్ల పోస్టులను నోటిఫికేషన్ ఇచ్చి లేదా పదోన్నతితో భర్తీ చేయాలని చెబుతోంది. డిగ్రీ లెక్చరర్లకూ ఇలాంటి నిబంధనే వర్తిస్తుంది. మేమంతా జూనియర్, డిగ్రీ లెక్చరర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులకు నిబంధనల మేరకు అర్హులం. జూనియర్, డిగ్రీ లెక్చరర్ల పోస్టులను కాలేజ్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేసేలా ఆంధ్రప్రదేశ్ కాలేజ్ సర్వీస్ కమిషన్ చట్టం 1985ను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. అయితే, ఈ చట్టం 2001లో రద్దయింది. ఆ తర్వాత నుంచి పారదర్శక విధానం లేకుండా కాంట్రాక్టు విధానంలో ఎంపిక కమిటీ పోస్టులను భర్తీ చేయడం ప్రారంభించింది. 2002 తర్వాత నుంచి నేరుగా ఈ పోస్టులను భర్తీ చేయలేదు. ఈ క్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ కోసం 2016, ఫిబ్రవరి 26న ప్రభుత్వం చట్టవిరుద్ధంగా సెక్షన్ 10ఏను చేరుస్తూ ప్రభుత్వం జీవో16ను తెచ్చింది. దీంతో అర్హతలు లేని వారు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు' అని పిటిషనర్లు వాదించారు.

విద్యాశాఖ వాదన..

'పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 101 మేరకు.. నిర్దిత వ్యవధిలో ఇప్పటికే ఉన్న చట్టాన్ని సవరణ చేసే, రద్దు చేసే వీలు సర్కార్‌కు ఉంది. 2014, జూన్ 2కు ముందున్న వారినే క్రమబద్ధీకరణ, రిజర్వేషన్లు కూడా వర్తింపు.. ఇలా సెక్షన్ 10ఏలో ఆరు నిబంధనలు చేర్చి ఆ మేరకే క్రమబద్ధీకరించాం. భవిష్యత్తులో మరిన్ని పోస్టులను భర్తీ చేయనున్నందున నిరుద్యోగ యువత అవకాశాలను జీవో 16 నిర్వీర్యం చేస్తుందన్న పిటిషనర్ల ఆందోళన సరికాదు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా క్రమబద్ధీకరణ జరిగిందనడం అర్థరహితం. జీవో 16 మేరకున్న పోస్టులను 2023, ఏప్రిల్ 30న జీవో 38 ద్వారా క్రమబద్ధీకరించాం' అని విద్యాశాఖ పేర్కొంది. 5,544 మందిని క్రమబద్ధీకరిస్తే కొందరినే ప్రతివాదులుగా పేర్కొనడంపై అనధికారిక ప్రతివాదుల (క్రమబద్ధీకరించిన వారు) తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. దీన్ని పరిగణనలోకి తీసుకుని రిట్ పిటిషన్లను కొట్టివేయాలన్నారు.

శృంగేరి శారద పీఠానికి వైఎస్ జగన్



వైఎస్ జగన్‌కు ప్రసాదం అందిస్తున్న స్వామీజీ


సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులోని శ్రీ శృంగేరీ శారద పీఠంలో జగద్గురువు శ్రీ విధుశేఖర భారతి స్వామిజీని మంగళవారం మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దర్శించుకున్నారు. పీఠంలోని ధార్మిక భవనంలో స్వామిజీ ఆశీర్వచనం తీసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. విజయ యాత్రలో భాగంగా స్వామిజీ దక్షిణాదిలోని 3 రాష్ట్రాల్లో 40 రోజుల పాటు పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా 18, 19 తేదిల్లో విజయవాడలోని శివరామకృష్ణ క్షేత్రంలో బస చేసిన ఆయనను వైఎస్ జగన్ కలిశారు. ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్, వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు అవుతు శైలజారెడ్డి, బెల్లం దుర్గ తదితరులు జగన్ వెంట ఉన్నారు. వైఎస్ జగన్ రాకను తెలుసుకొని పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అక్కడికి చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. వీరందరికీ చిరునవ్వుతో వైఎస్ జగన్ అభివాదం చేశారు.

పక్కకు ఒరిగిన భవనం

- హైదరాబాద్ మాదాపూర్ సమీపంలో కలకలం
- నాలుగంతస్తుల భవనంలోని అందరూ సురక్షితం



ఒరిగిన భవనం



భవనాన్ని ఆనుకొని తీసిన గుంత

గచ్చిబౌలి (హైదరాబాద్): రాజధాని నగరంలోని మాదాపూర్ ఐటీ కారిడార్‌కు చెంతనే ఉన్న సిద్ధిఖీనగర్‌లో నాలుగు అంతస్తుల భవనం పక్కకు ఒరిగిన ఘటన కలకలం రేపింది. వసుకుల లక్ష్మణ్ అనే వ్యక్తి ప్లాట్ నం. 1639లో 70 గజాల స్థలంలో జీప్లస్ ఫోర్ భవనాన్ని నిర్మించారు. ఫ్లోర్‌కు రెండు పోర్షన్ల చొప్పున నాలుగు ఫ్లోర్లు నిర్మాణం చేశారు. ఆ భవనంలో మొత్తం 48 మంది అద్దెకు ఉంటున్నారు. వారంతా చెంతనే ఉండే ఐటీ కంపెనీల్లో హౌస్‌కీపింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో గోడ కూలినట్లు శబ్దం వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. కానీ రాత్రి 8.30 గంటల సమయంలో పెద్దగా శబ్దం వచ్చి భవనం ఒరిగిపోతోందని అరుపులు వినిపించడంతో అందరూ భయాందోళనలకు గురయ్యారు. ప్రాణాలు అరచేతిలో పట్టుకొని ఆదరాబాదరాగా కిందకు వచ్చేశారు. ఇంతలోనే మూడో అంతస్తులో ఉండే సాదిక్ హుస్సేన్ కిందికి దూకగా అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఈలోగా అందరూ కిందకు వచ్చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే భవనం నిర్మించినట్లు తెలుస్తోంది.

పక్క స్థలంలో గుంతలు తీయడంతోనేనా..

ఈ భవనం పక్కనే ఉండే 1605, 1638 ప్లాట్లను కలిపి భవనం నిర్మించేందుకు పిల్లర్లు వేయడానికి గుంతలు తవ్వారు. వీటితో భవనానికి ఇబ్బంది వస్తుందని ఈ భవన యజమాని వారిని హెచ్చరించారు. అయినా వారు వినలేదు. దీనివల్లే ఈ భవనం పరిస్థితి ఇలా మారిందని కొందరు అంటున్నారు. ఘటనా స్థలాన్ని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, శేరిలింగంపల్లి టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణ, మాదాపూర్ ఏసీపీ శ్రీకాంత్, డీఆర్‌ఎఫ్ సిబ్బంది పరిశీలించారు. పక్కకు ఒరిగిన భవనం చుట్టూ ఉండే పది భవనాల్లో నివాసం ఉండేవారిని ముందు జాగ్రత్త చర్యగా ఖాళీ చేయించి వేరేచోటికి తరలించారు. ఈ భవనం ముందు కేవలం పదిఫీట్ల రోడ్డు మాత్రమే ఉంది. భవనాన్ని ఇంజనీర్లు పరిశీలించి నాణ్యతను నిర్ణయిస్తారని, వారి నివేదిక ఆధారంగా ఒరిగిన భవనాన్ని తొలగిస్తామని ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. అలాగే ఈ భవనం వెనుక లోతైన గుంతలు తీసిన బిల్డర్‌పైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భవనం విరిగిందని అరుపులు వినిపించడంతో వచ్చేశా..

'మేము మొదటి అంతస్తులో ఉంటున్నాం. రాత్రి 8.30 గంటల సమయంలో శబ్దం వచ్చింది. కొద్దిసేపటికే ఇంట్లోని సామాన్లు కిందపడిపోవడం ప్రారంభమైంది. అదే సమయంలో భవనం విరిగిందని అరుపులు వినిపించడంతో వంట చేస్తున్న స్టవ్ ఆర్పకుండానే భయంతో కిందికి వచ్చేశా' అని జహరుల్ చెప్పారు.

బందోబస్తు మధ్య
'ఫ్యూచర్' రోడ్డుకు సర్వే

- గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం కోసం కొంగరకలాన్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు భూసేకరణ
- పరిహారం చెల్లింపు విషయంలో స్పష్టత కరువు
- రైతులు, మహిళల నిరసన



కొంగరకలాన్ రెవెన్యూలో సర్వే చేయడానికి వచ్చిన అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

కందుకూరు/ఇబ్రహీంపట్నం రూరల్: ఫ్యూచర్ సిటీ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వే పనులను మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య చేపట్టారు. ఈ సందర్భంగా భూములు ఇచ్చి తామెక్కడికి వెళ్లాలంటూ రైతులు ఆవేదన వెలిబుచ్చారు. భూములు కోల్పోతున్న వారికి ఎంత పరిహారం ఇస్తారు? ఎలా న్యాయం చేస్తారో చెప్పకుండా పోలీసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు సర్వే చేస్తుండగా.. కొంగరకలాన్‌లో కలెక్టరేట్ వెనక వైపు చేపట్టిన సర్వే పనులను అడ్డుకుని మహిళలు నిరసన తెలిపారు. రాజు అనే యువ రైతు తమ భూమి తీసుకుంటే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో పోలీసులు అతన్ని సముదాయించి అక్కడి నుంచి పంపించారు.

330 అడుగుల రహదారి

రంగారెడ్డి జిల్లా కందుకూరు, యాచారం మండలాల్లో గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీని నిర్మించడానికి సిద్ధమైన విషయం తెలిసిందే. అక్కడికి చేరుకునేలా ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 330 అడుగుల రహదారి నిర్మాణానికి ప్రతిపాదించింది. ఇందుకోసం ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్, మహేశ్వరం మండలం కొంగరకుర్దు, కందుకూరు మండలం లేమూరు, తిమ్మాపూర్, రాచులూరు, గుమ్మడవెల్లిలో రిజర్వు ఫారెస్ట్, పంజగూడ, మీర్‌ఖాన్‌పేటలో కలిపి మొత్తం 449.27 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. ఫ్యూచర్ సిటీ రోడ్డు కోసం ఇటువైపు కందుకూరు మండలం రాచులూరుతోపాటు అటువైపు ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్‌లో అధికారులు ఏకకాలంలో సర్వే పనులు ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, కందుకూరు తహసీల్దార్ గోపాల్, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐలు సీతారామ్, వెంకట్‌తోపాటు పోలీసుల బందోబస్తు నడుమ సర్వే నిర్వహించారు. అక్కడి రైతులు అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అంత పెద్ద రోడ్డు నిర్మిస్తే పొలాలు మొత్తం పోయి, రోడ్డున పడాల్సి వస్తుందని వాపోయారు. సమావేశం ఏర్పాటు చేసి తర్వాత వివరాలు వెల్లడిస్తామని చెప్పి అధికారులు సర్వేను కొనసాగించారు.

పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు పెంచాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

విజయనగర్ కాలనీ: పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌ను 22 నుంచి 42 శాతం వరకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్ దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లోని డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వరరావును బీసీ నాయకులతో కలిశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం డెడికేటెడ్ బీసీ కమిషన్‌ను నియమించాలని, దీనికి విస్తృతమైన, న్యాయపరమైన, రాజ్యాంగపరమైన అధికారాలున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కులగణన చేసి దాని ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచితే న్యాయపరమైన, చట్టపరమైన అవరోధాలుండవని చెప్పారు. అగ్ర కులాలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు పెట్టినప్పుడు 50 శాతం సీలింగ్ కాలం చెల్లిన విధానమని సుప్రీంకోర్టు తెలిపిందన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకుడు గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, వేముల రామకృష్ణ, గొరిగె మల్లేశ్, జిల్లపల్లి అంజి, సతీశ్, అల్లంపల్లి రామకోటి, వీరన్న, అనంతయ్య, సి.రాజేందర్, జయంతి, రాఘవేందర్, వంశీకృష్ణ, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు


అసిస్టెంట్ ఇంజనీర్లకు పోస్టింగ్ ఇవ్వాలి



సీఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాల్వంచ: పవర్ జనరేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యాన 339 అసిస్టెంట్ ఇంజనీర్ల నియామకానికి రాతపరీక్ష నిర్వహించి ఫలితాలు విడుదల చేసినందున త్వరగా పోస్టింగ్ ఇవ్వాలని కేటీపీఎస్ 5, 6వ దశల బ్రాంచ్ కార్యదర్శి డి.ఉమామహేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం సీఈ ఎం.ప్రభాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్యదర్శి దర్పంగా మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్లకు బదిలీలు చేపట్టడంతో పాటు కేటీపీఎస్ 5, 6వ దశల్లో ఖాళీగా ఉన్న 57 ఇంజనీర్ల పోస్టులు భర్తీ చేయాలన్నారు. అసోసియేషన్ నాయకులు జయభాస్కర్, చంద్రకళాధర్, పావని, ఎస్.ప్రదీప్, టి.దివాకర్, కె.మధుసూదన్, బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు పార్టీ దళ సభ్యుడు లొంగుబాటు



మావోయిస్టు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: మావోయిస్టు పార్టీ బెటాలియన్ దళ సభ్యుడు, రూ.లక్ష రివార్డు కలిగిన మడవి అయిత అలియాస్ మంగు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట మంగళవారం లొంగిపోయాడు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజు వివరాలు వెల్లడించారు. ఛత్తీస్ గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా జీలోరుగడ్డకు చెందిన మంగు 2020లో హిడ్మా నాయకత్వాన మావోయిస్టుల్లో చేరగా ఆ రాష్ట్రంలో జరిగిన పలు విధ్వంసకర సంఘటనల్లో పాల్గొన్నాడని ఎస్పీ తెలిపారు. కాగా, ఆపరేషన్ చేయూత కార్యక్రమంలో ఆయన జిల్లా పోలీసులు, 141 బెటాలియన్, ఆర్‌ఎఫ్‌టీ, సీఆర్‌పీఎఫ్ అధికారుల ఎదుట లొంగిపోయాడని వెల్లడించారు. కాగా, ప్రశాంత జీవనం గడపాలనుకునే మావోయిస్టులు తమ బంధువుల ద్వారా కానీ నేరుగా కానీ లొంగిపోవాలని ఎస్పీ సూచించారు.

మళ్లీ రాజుకుంటున్న పోడు వివాదం

- తేలని రెవెన్యూ, అటవీశాఖల సరిహద్దు సమస్య
- పట్టాలు ఉన్నా భూములు కోల్పోతున్న గిరిజనులు
- అటవీశాఖ ఫిర్యాదులపై వెనువెంటనే కేసులు
- పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు



పోడుభూమిలో సాగు చేసుకుంటున్న గిరిజన కుటుంబం



అటవీశాఖ అధికారులు, పోడు రైతుల మధ్య వాగ్వాదం (ఫైల్)

ఇల్లెందురూరల్: పోడు భూములు తరతరాలుగా గిరిజన రైతులకు ఆదెరువుగా నిలుస్తున్నా ఎలాంటి హక్కులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి గిరిజనులకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పంపిణీ చేశారు. ఆ తర్వాత రెండేళ్ల క్రితం నాటి సీఎం కేసీఆర్ మరోమారు పోడు భూములకు పట్టాలు పంపిణీ చేశారు. అయినప్పటికీ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదు. అటవీ, రెవెన్యూ భూములకు సంబంధించి స్పష్టమైన హద్దులు లేకపోవడమే ఇందుకు కారణమని చెబుతుండగా, పోడు ఘటనలపై తరచూ వివాదాలు జరుగుతూనే ఉన్నాయి.

సమన్వయలేమి.. ఏళ్ల తర్వాత స్వాధీనం

అటవీ, రెవెన్యూ శాఖల అధికారుల పట్టుదలతో భూముల హద్దులు తేలడం లేదు. ఈ కారణంగా భూవివాదాలు ఎంతకూ తెగకపోగా అర్హులైన రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఇప్పటివరకు పలు దఫాలుగా సంయుక్త సర్వే చేపట్టినా హద్దులు మాత్రం తేల్చలేకపోయారు. రెవెన్యూ అధికారుల వద్ద గ్రామ విస్తీర్ణంతోపాటు అటవీ, రెవెన్యూ భూముల హద్దులు నిర్ణయించే నక్షాలు లేకపోగా, అటవీశాఖ అధికారులు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు కలిగిన గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను తమవిగా చెబుతూ స్వాధీనం చేసుకుంటున్నారు. ఫలితంగా పలు గ్రామాల్లో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇల్లెందు మండలంలో రెండు దఫాలుగా పోడు భూములకు పట్టాలు పంపిణీ చేశారు. అయితే, తొలిదఫా హక్కుపత్రాలు అందుకున్న రైతుల నుంచి అటవీశాఖ అధికారులు ఆలస్యంగా ఆ భూములు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఇదే తరహాలో రెండో దఫా పట్టాలు పంపిణీ చేసిన రెండేళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ పోడు భూముల స్వాధీనానికి యత్నిస్తుండడం గమనార్హం.


ఫిర్యాదుల వెల్లువ

అధికారులు పోడు భూములను స్వాధీనం చేసుకుంటుండడంతో పలు గ్రామాల్లో గిరిజన రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇల్లెందు మండలం ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలో భూక్యా సరోజ కుటుంబానికి ముప్పై ఏళ్ల క్రితం ప్రభుత్వం రెవెన్యూ భూమి నాలుగెకరాలకు పట్టా అందజేసింది. అదే సమయాన పక్కనే అటవీభూమి 5.23 ఎకరాల్లో పోడు సాగు చేస్తుండగా ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా మంజూరైంది. ఈ భూమికి రైతుబంధు నిధులు కూడా అందాయి. కానీ అటవీశాఖ అధికారులు పట్టా ఉన్న రెవెన్యూ భూమినే అటవీ శాఖదని చెబుతూ స్వాధీనం చేసుకున్నారు. అలాగే, మొండితోగుకు చెందిన తాటి పోశాలు భార్య భద్రమ్మ పేరిట రెవెన్యూ అధికారులు పట్టాదారు పాస్‌పుస్తకం జారీ చేశారు. ఆ భూమి అటవీ పరిధిలో ఉందని చెబుతూ ఐదెకరాల భూమిని మూడేళ్ల క్రితం అటవీశాఖ స్వాధీనం చేసుకుంది. ఇలా మట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 479, సీఎస్పీ బస్తీ పరిధి సర్వే నంబర్ 549, రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ పరిధి సర్వే నంబర్ 131 పరిధిలో పోడు సమస్య అపరిష్కృతంగానే ఉంది. స్థానికంగా ఫిర్యాదు చేసినా ఫలితం లేక నేరుగా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేస్తున్నారు.

సమగ్ర విచారణ లేకుండానే...

ఏదైనా భూసమస్య ఉత్పన్నమైతే రెవెన్యూ, అటవీశాఖల అధికారుల నుంచి లిఖితపూర్వకంగా వివరణ తీసుకున్నాకే పోలీసులు అడుగు ముందుకు వేయాల్సి ఉంటుంది. కానీ ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ నెహ్రూనగర్‌కు చెందిన గిరిజన రైతు భూక్యా సరోజకు సంబంధించిన వివాదంలో అటవీశాఖ అధికారుల ఫిర్యాదుపై పోలీసులు విచారణ లేకుండానే కేసు నమోదుకు సిద్ధం కావడం విమర్శలకు తావిస్తోంది.


భూముల నుంచి వెళ్లగొడుతున్నారు



ముప్పై ఏళ్ల క్రితం నాలుగెకరాలకు ప్రభుత్వం పట్టా మంజూరు చేసింది. పక్కనే అటవీ ప్రాంతం ఉండడంతో అప్పట్లోనే పోడు నరికి సాగు చేశాం. ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు కూడా అందాయి. కానీ ఇప్పుడు అటవీశాఖ అధికారులు ఆ భూములు వారివని వెళ్లగొడుతున్నారు.

– భూక్యా సరోజ, నెహ్రూనగర్, ఇల్లెందు మండలం

అటవీ భూములనే స్వాధీనం చేసుకున్నాం



మండలంలో అటవీశాఖ పరిధిలో భూఆక్రమణలను అడ్డుకుంటున్నాం. వివాదాస్పద భూములకు జారీ చేసిన ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలపై ఉన్నతాధికారులకు నివేదించి విచారణ చేస్తాం. నెహ్రూనగర్‌లో అటవీ భూమి ఆక్రమణకు ప్రయత్నం జరగడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాం.

– ప్రసాద్, ఎఫ్‌ఆర్‌ఓ, ఇల్లెందు మండలం

అల్పాహారం సమకూర్చే అవకాశం కల్పించండి



మంత్రితో మాట్లాడుతున్న సంస్థ బాధ్యులు

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును హరే రామ హరే కృష్ణ మూవ్‌మెంట్ బాధ్యులు మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యాన ఖమ్మం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందించే అవకాశం ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల అల్పాహారం అందిస్తామని ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. సంస్థ వారికి కిచెన్ షెడ్డు నిర్మాణం, ఇతర వనరులు కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను ఫోన్‌లో ఆదేశించారు. సంస్థ బాధ్యులు కౌటిల్యదాస్, రవి సులోచనాదాస్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేనెల 1న 'జన భోజనాలు'



సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల అశోక్

ఖమ్మంమయూరిసెంటర్: 'కుల భోజనాలు వద్దు.. జన భోజనాలు చేద్దాం రండి' నినాదంతో వచ్చేనెల 1న సకల జనభోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్, స్పర్శ అధ్యయన వేదిక బాధ్యులు కాకి భాస్కర్ తెలిపారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం వారు మాట్లాడారు. కార్తీక మాసంలో కులాల ఆధారంగా వనభోజనాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈనేపథ్యాన ప్రత్యామ్నాయ సంస్కృతిలో భాగంగా సకల జన భోజనాలు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఖమ్మం ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాల వెనకాల మామిడి తోటలో వచ్చేనెల 1న జరిగే జన భోజనాలకు మేధావులు, ప్రజాస్వామికవాదులు హాజరుకావాలని కోరారు. నాయకులు ఝాన్సీ, సీహెచ్.శిరోమణి, కొల్లేటి నాగేశ్వరరావు, కె.శ్రీనివాస్, మంగతాయి, శోభ, లక్ష్మణ్, తేజ నాయక్, రాకేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

కొండరెడ్ల అభివృద్ధికి కృషి

ఐటీడీఏ పీఓ రాహుల్



వెదురు కళాకృతిని ఐటీడీఏ పీఓ రాహుల్‌కు అందిస్తున్న గిరిజనులు

అశ్వారావుపేట: అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని కొండరెడ్ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ వెల్లడించారు. దమ్మపేట మండలం గోగులపూడి, దమ్మపేట మండలం పూసుకుంట కొండరెడ్ల గ్రామాలను మంగళవారం ఆయన సందర్శించారు. రూ.16లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను శుభకార్యాలకు వినియోగించుకోవాలని సూచించిన పీఓ, విద్యావంతులైన యువత ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు సాధించేలా శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. పూసుకుంటలో విద్యుత్ సౌకర్యం అవసరమైన పట్టా భూములు, డెయిరీ, గోబర్‌గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు, మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతు, శిథిలమైన ఇళ్ల పునర్నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అతర్వాత అశ్వారావుపేట మండలం గోగులపూడిలో రూ.15లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన వెదురు కళాకృతులను పరిశీలించిన పీఓ ఐటీడీఏ ద్వారా మార్కెటింగ్ చేయించి కొండరెడ్లకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. విద్యావంతులు సబ్సిడీ రుణాలు పొంది ఉపాధి పొందడంతోపాటు మరి కొందరికి అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఐడీడీఈ ఈఈ తానాజీ, ఏపీఓ పవర్ ఏఈ మునీర్ పాషా, తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలల్లో ఒలింపియాడ్

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించడమే లక్ష్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా తొమ్మిది పాఠశాలల్లో విద్యార్థులు సామర్థ్యాలు పెంపొందించి, ప్రస్తుత పోటీ ప్రపంచంలో సత్తా చాటేలా ఒలింపియాడ్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు యాజమాన్యం కసరత్తు చేస్తోంది. దేశంలోని పలు ప్రాంతాల్లో ఒలంపియాడ్ నిర్వహించే సంస్థ 'యునిఫైడ్ కౌన్సిల్' ప్రతినిధి కె.శ్రీధర్‌తో కలిసి ఇటీవల ప్రణాళిక రూపొందించారు. పోటీపరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా ఈ విధానం ద్వారా మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే కొత్తగూడెం, భూపాలపల్లి, శ్రీరాంపూర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కమిటీని కూడా నియమించారు.

మూడు దశల్లో...

ప్రస్తుత విధానంలో పాఠాలు బోధించే ఉపాధ్యాయులే పరీక్ష నిర్వహించి వారే దిద్దుతారు. కానీ ఒలింపియాడ్ విధానంలో పాఠాలు చెప్పడం, ప్రశ్నపత్రం తయారుచేయడం, వాల్యూయేషన్ ఇలా మూడు ముగ్గురితో చేయిస్తారు. ఆపై విద్యార్థులు ఏ సబ్జెక్టులో ఏ స్థాయిలో ఉన్నారు, వారిని మరింతగా తీర్చిదిద్దడం ఎలా అనే అంశంపై సమీక్షిస్తారు. ఇలా థర్డ్‌పార్టీ ఆధ్వర్యాన జరిగే ప్రక్రియను కోఆర్డినేటర్లు పరిశీలిస్తుంటారు. కాగా, ఏ పోటీ పరీక్షకైనా కొంత రుసుము చెల్లించాల్సి ఉండడంతో తల్లిదండ్రుల సంసిద్ధతపై ఒలింపియాడ్ విధానం నిర్వహణ ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయమై సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీపరీక్షల్లో ప్రతిభ చాటేలా తీర్చిదిద్దేందుకు ఒలింపియాడ్ విధానం అమలుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు.